ప్రజాశక్తి

గురువారం 23 అక్టోబర్ 2025 5

శ్రీ సత్యసాయి

అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

దక్షిణ పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులపాటు రాయలసీమ ప్రాంతాలలో ఒక మోస్తారు వర్షంతో పాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని ఏపీ విపత్తుల నిర్వహణ శాఖ నుంచి సమాచారం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ హెచ్చరించారు. భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సూచనల మేరకు బుధవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించి తీసుకోవలసిన చర్యలపై దిశ నిర్దేశం చేశారు. కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఇన్‌ఛార్జి డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంటకు 35 నుంచి 45 కిలోమీటర్ల వేగంతో కొన్నిచోట్ల 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు అందరూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని అవసరమైనప్పుడు అధికారుల సూచనల మేరకు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని చెప్పారు. వంతెనలపై నీటి ప్రవాహం ఉన్నప్పుడు ఆయా గ్రామస్తులు అలాంటి వంతెనలపై ప్రయాణాలు చేయకూడదన్నారు. నదీ పరివాహక ప్రాంతాలకు దూరంగా ఉండాలని అక్కడ నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అలాగే ఏపీ విపత్తుల శాఖ సూచనల మేరకు కలెక్టరేట్లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వర్షాలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే 08555-289039 కు ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎక్కడ ప్రాణ, ఆస్తి నష్టాలు లేకుండా జిల్లా యంత్రాంగం అంతా అపమత్తంగా ఉండాలని, వాగులు, వంకలు, నదులు, గట్లు తెగే ప్రమాదం ఉంటే ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. తహశీల్దార్లు ఆయా మండల కేంద్రాలలోనే ఉంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఆగుతున్న గ్యాస్ సరఫరా... ఇబ్బందుల్లో వినియోగదారులు

ప్రత్యామ్నాయానికి అవకాశం లేకుండా చేసిన ఏజెన్సీ

ప్రజాశక్తి-హిందూపురం

తమ వద్ద కనెక్షన్ తీసుకుంటే 24 గంటలు ఎక్కడ అంతరాయం లేకుండా గ్యాస్ సరఫరా చేయడంతో పాటు అదనపు రాయితీలు అందిస్తామని పట్టణంలో ఓ ప్రైవేట్ గ్యాస్ ఏజెన్సీ ప్రచారం చేస్తూ స్థానిక టీచర్స్ కాలనీతో పాటు పట్టణంలో వివిధ ప్రాంతాలలో భూగర్భ పైప్ లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. నిజమే కదా అని నమ్మి చాలామంది వినియోగదారులు వారు వాడుతున్న హెచ్‌పి, ఇండియన్ గ్యాస్ కనెక్షన్లను తొలగించుకొని నిత్యం గ్యాస్ సరఫరా పైప్ లైన్ ద్వారా సరఫరా అయ్యే గ్యాస్ కనెక్షన్లను తీసుకున్నారు. ఉన్న గ్యాస్ కనెక్షన్లను తొలగించుకొని నిత్యం సరఫరా అవుతుందన్న నమ్మకంతో పైప్ లైవ్ ద్వారా తీసుకున్న గ్యాస్ కనెక్షన్‌లో ప్రస్తుతం సరిగా గ్యాస్ సరఫరా కాక 'రెంటికీ చెడిన రేవు'లాగా వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై వినియోగదారులు ఏజెన్సీ నిర్వాహకులకు ఫిర్యాదు చేస్తే వారు చెప్పే మాట ఒక్కటే... గ్యాస్ పైప్ పగిలి లీకేజీ అవుతోందనిదీంతో గ్యాస్ సరఫరా ఆపివేసామని చెప్తున్నారు. ముఖ్యంగా పిల్లలు పాఠశాలకు వెళ్లే సమయంలో, సాయంత్రం ఇంటికి వచ్చే సమయంలోనే గ్యాస్ సరఫరా ఆగిపోతోంది. దీంతో విద్యార్థులకు అవసరమైన ఫలహారాలు చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడానికి వీలు లేకుండా ఏజెన్సీ నిర్వాహకులు గ్యాస్ స్టవ్, గ్యాస్ సరఫరా అవుతున్న పైప్ కు నేరుగా కనెక్షన్ ఇవ్వడంతో సాధ్యం కావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. సమాచారం ఇచ్చిన వెంటనే సిలిండర్ ఇంటి వద్దకే సరఫరా చేసి ఏజెన్సీని సైతం వద్దనుకొని పైప్ లైన్ ద్వారా గ్యాస్ కనెక్షన్ తీసుకోవడంతో తమ పరిస్థితి 'పెనం మీద నుంచి పొయ్యిలోకి పడినట్లు' ఉందని వినియోగదారులు వాపోతున్నారు. గ్యాస్ సరఫరాలలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏజెన్సీ పై అధికార యంత్రాంగం శాఖ పరమైన చర్యలు తీసుకోవడంతో పాటు గ్యాస్ సరఫరా ఆగిపోయిన వెంటనే చర్యలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

అనుమతులు లేకుండా జెసిబి పనులు చేయడంతోనే లీకేజీలు :

పట్టణ వ్యాప్తంగా గ్యాస్ సరఫరా కోసం పైప్‌లైన్ ఏర్పాటు చేశామని ఏజెన్సీ సీనియర్ ఇంజనీర్ శివేంద్రసింగ్ అన్నారు. పైప్ లైన్ ఉన్న ప్రాంతాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేశామని పైప్ లైన్ పైన వార్నింగ్ మ్యాట్‌ను వేశామని చెప్పారు. అయినప్పటికి కొంతమంది జెసిబితో తమ పనుల కోసం గుంతలు తీయడంతో లీకేజీలు అవుతున్నాయన్నారు. కొంత మంది అనుమతులు తీసుకోకుండా గుంతలు కొడుతున్నారని దీంతో గ్యాస్ లీజీల కారణంగా గ్యాస్ సరఫరా ఆగిపోతోందని చెప్పారు. వినియోగదారులకు నిత్యం గ్యాస్ సరఫరా చేయడం కోసం మరో లైన్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. జెసిబితో పనులు చేసే సమయంలో ముందస్తు సమాచారం అందిస్తే తమ సిబ్బంది అక్కడే ఉండి ఎటువంటి సమస్యలు రాకుండా చూస్తారన్నారు. ఈ విషయాన్ని ప్రతి నెల పట్టణ వ్యాప్తంగా ఆటోతో మైక్ ద్వారా ప్రచారం చేస్తున్నామని అయినప్పటికి ఎవరు సహకరించడం లేదని చెప్పారు. అందరు సహకరిస్తే వినియోగదారులకు నిత్యం గ్యాస్ సరఫరా చేస్తామన్నారు.

వినియోగదారుడి నివాసంలో అమర్చిన గ్యాస్ కంట్రోలర్ పాయింట్

'లెక్క'ల మాస్టారుకు రాజకీయ అండ..!

ప్రజాశక్తి - చిలమత్తూరు

ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉంటూ అక్రమార్జనకు అలవాటు పడి ప్రయివేటు క్లాస్ లను యూటూబ్, ఆర్ఎన్ఎస్ స్టడీస్ పేరుతో ఫెయిడ్ యాప్ ను నడుపుతూ నిరుద్యోగుల నుండి లక్షలాది రూపాయలు దండుకుంటున్న చిలమత్తూరు శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పని చేస్తున్న గణితశాస్త్రం ప్రభుత్వ ఉపాధ్యాయుడుకి రాజకీయ నాయకుల అండ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఆయనే బహిరంగంగా చెప్పడంపై మండల విద్యాశాఖలో చర్చనీయాంశం అయింది. లెక్కల మాస్టారు బాగోతంపై ప్రజాశక్తి దినపత్రికలో కథనం రాగానే సదరు ఉపాధ్యాయుడు ఓ రాజకీయ నాయకుడిని ఆశ్రయించినట్లు సమాచారం. ఆ నాయకుడితో విద్యాశాఖ అధికారులకు ఫోన్ చేయించి ఎలాంటి చర్యలు లేకుండా చూడమని చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో చేతులు కూడా తడిపినట్లు అరోపణలు ఉన్నాయి. గతంలో ఇలా ప్రయివేటు కోచింగ్ సెంటర్లను నడుపుతున్న అనంతపురానికి చెందిన ఓ గణితశాస్త్ర ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆధారాలన్నీ కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నా విద్యాశాఖ ఉన్నత అధికారులు స్పందించక పోవడం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే సదరు ఉపాధ్యాయుడు తనపై ఎన్ని వార్తలు వచ్చినా అందర్ని మేనేజ్ చేశానని జబ్బలు చరచుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. చిలమత్తూరులోని లెక్కలమాస్టారు బాగోతంపై జిల్లా విద్యాశాఖ అధికారి క్రిష్టప్పని ప్రజాశక్తి ఫోన్ ద్వారా వివరణ కోరింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రయివేటు యాప్‌ల ద్వారా పాఠ్యాంశాల బోధన, ఫీజుల వసూళ్లపై ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులను, మండల విద్యాశాఖను విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. విచారణ అనంతరం కఠిన చర్యలు ఉంటాయని ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉంటూ నింబందనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే లెక్కల మాస్టారు యాప్ తో పాటు యూట్యూబ్ లోను పాఠ్యాంశాలు బోధిస్తున్నట్లు కళ్లకు కట్టినట్లు బహిర్గతం అవుతున్నా ఈ విషయం వారం క్రితమే పత్రికల్లో ప్రచురితమైనా ఇప్పుడే తమకు తెలిసిందన్న చెందంగా విచారణకు ఆదేశిస్తున్నామని చెప్పడం అదికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

ఆర్ఎన్ఎస్ స్టడీస్ పేరుతో తయారుచేసిన యాప్ లోగో

మంట రా'జేసి'న మాటలు

పోలీసు అమరవీరు దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పోలీసు అమరవీరు దినోత్సవం నాడు తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రి ఎఎస్పీపై చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారమే రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలను వైసిపి నాయకులతోపాటు, జిల్లా పోలీసు అధికారుల సంఘం కూడా తప్పుబట్టింది. పోలీసు ఉన్నతాధికారిని కించపరిచే విధంగా మాట్లాడటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

ఉన్నతాధికారుల స్పందనేదీ : అనంత వెంకటరామిరెడ్డి , వైసిపి జిల్లా అధ్యక్షులు

ఐపిఎస్ అధికారిని కించపరిచే విధంగా మాట్లాడుతున్నా ఉన్నతాధికారులు స్పందించారా అని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. ఐపిఎస్ అధికారుల పట్లనే ఆ రకంగా మాట్లాడుతున్నా పట్టించుకోకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. ఐపిఎస్ అధికారి ఇంట్లోకే వస్తామంటూ బెదిరిస్తున్నా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

జెసి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం : సాకే త్రిలోక్ జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు

ఎఎస్పీ రోహిత్ కుమార్ నిజాయితీగా పనిచేస్తున్న ఐపిఎస్ అధికారి అని జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్ తెలిపారు. ఆయన పట్ల తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఉన్నతాధికారిని కించపరిచే విధంగా మాట్లాడటం సరైంది కాదని అన్నారు. నిజంగానే ఏమైనా సమస్య ఉంటే దాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు వీలుందన్నారు. అలా కాకుండా అధికారినే కించపరిచే విధంగా మాట్లాడటం మంచిది కాదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. వారి ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీసే విధమైన వ్యాఖ్యలు సరైనవి కాదని పేర్కొన్నారు.

గతంలోనూ పోలీసు అధికారులపై ఇదే తీరు

గతంలో జెసి. ప్రభాకర్‌రెడ్డి పోలీసు అధికారుల పట్ల ఇదే రకంగా వ్యవహరించారన్న విమర్శలున్నాయి. అంతకు మునుపు అధికారంలో ఉండగా జెసి.దివాకర్‌రెడ్డి పోలీసులపై ఇదే రకమైన వ్యాఖ్యలు చేయడం, దానికి వ్యతిరేకంగా అప్పటి పోలీసు సంఘం అధికారిగానున్న మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ మీసం తిప్పి సవాల్ చేయడం చర్చనీయాంశమైంది. ఆ తరువాత గడిచిన ఐదేళ్లలో తాడిపత్రి డీఎస్పీ చైతన్యపై పలుమార్లు ఆరోపణలు చేశారు. ఆయనతో బహిరంగంగానే మాటల యుద్ధం నడించింది. ఇప్పుడు టిడిపి అధికారంలోకి వచ్చాక అనేక మంది డీఎస్పీలు మారారు. తాజాగా ప్రభుత్వం ఐపిఎస్ అధికారిని అక్కడ నియమించింది. ఆయన ఇటీవలనే కొంత మందిపై కేసులు నమోదు చేసి గట్టి హెచ్చరికలు చేశారు. ఈ నేపథ్యంలో జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం మరోమారు వివాదంగా మారింది.

ఏఎస్పీపై జేసీ వ్యాఖ్యలు దుమారం
తప్పుబట్టిన పోలీసు అధికారుల సంఘం

జేసీపై చట్టపరమైన చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి - గుత్తి

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో, తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ చౌదరి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు. బుధవారం గుత్తి పోలీస్ స్టేషన్ ను ఆయన తనిఖీ చేశారు.రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా,నిర్భయంగా తమ విధులను నిర్వహించాలని చెప్పారు. గతంలో పోలిస్తే ప్రస్తుతం క్రైమ్ రేట్ తగ్గిందన్నారు.గుత్తిలో పోలీస్ శాఖకు సంబంధించిన స్థలాలను వాణిజ్యపరంగా వినియోగిస్తామన్నారు.ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించేందుకు, సంబంధిత శాఖలతో సమన్వయంగా తగు చర్యలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సిఐ రామారావు, ఎస్ఐలు కె.సురేష్, నాగప్ప, ఎఎస్ఐలు నాగ మాణిక్యం రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

కార్పొరేట్ల చేతుల్లోకి ఆదివాసీ భూములు : సిపిఎం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదివాసీ భూములను సైతం కార్పొరేట్లకు కట్టబెడుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణంలో జై భీమ్ ఏపీ ఎస్ పి టి డి అసోసియేషన్ ఆధ్వర్యంలో కొమరం భీం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించారు. అరంతరం రామకృష్ణ మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన ఘనత కొమరం భీమ్ కే దక్కుతుందని అన్నారు. కొనియాడారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ రీజినల్ నాయకులు ఆర్ జి నాయక్, కెవి. రమణ, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జీవైపురావు, జై భీమ్ డిపో నాయకులు జి గంగాధర్, రవి నాయక్, గంగరాజు, నారాయణస్వామి, రమణప్ప, సిజే రాములు,ఎస్వీ నర్సు, సుందర్, ఎంప్లాయిస్ యూనియన్ డిపో నాయకులు ఎం. కొండారెడ్డి, సుధీందర్ స్వామి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 'పాంచజన్య' విద్యార్థిని

పోటీలకు ఎంపికైన విద్యార్థి సన్నిధిని అభినందిస్తున్న పాంచజన్య శ్రీనివాసులు, తదితరులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని పాంచజన్య ఉన్నత పాఠశాల విద్యార్థిని టి. సన్నిధి రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల అధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ, తమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని టి. సన్నిధి ఈ నెల 18వ తేదీన అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి అండర్ -19 షటిల్ బ్యాట్మింటన్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. సన్నిధి త్వరలో విశాఖపట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. తమ పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వ కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయిత్రి, పరిపాలన అధికారి భాస్కర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సూర్యఘర్'పై వినియోగదారుల్లో అవగాహన పెంచాలి

సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఇ సంపత్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం డివిజన్ వ్యాప్తంగా విద్యుత్ శాఖ అధికారులు వినియోగదారుల్లో పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన పెంచి, వారి ఇళ్ల మీద సోలార్ ప్యానల్ లను అమర్చుకునే విధంగా చూడాలని విద్యుత్ శాఖ ఎస్ఇ సంపత్ కుమార్ సూచించారు. బుధవారం పట్టణంలోని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో హిందూపురం డివిజన్ వ్యాప్తంగా ఉన్న పెనుగొండ, మడకశిర, అకౌంట్స్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఇ సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా పై ప్రత్యేక దష్టి సారించి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. లో వోల్టేజ్ సమస్యలు రాకుండా అవసరమైన చోట డిటిఆర్ఎస్‌లను అమర్చాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయ విద్యుత్ సర్వీస్ కనెక్షన్ లలో ఎటువంటి జాప్యం చేయకుండా నిబంధనల మేరకు తక్షణం సర్వీసు ఇవ్వాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు బాధ్యతగా గృహ విద్యుత్ వినియోగదారులకు అవగాహన పెంచి పిఎం సూర్య ఘర్ పథకం కింద సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అకౌంట్స్ సిబ్బంది సహకారంతో విద్యుత్ బకాయిలు నూరు శాతం వసూలు చేయాలని ఆదేశించారు. సిబ్బందితో పాటు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ తోపాటు ఏడీలు, ఏఈ లు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కేసులో దాల్‌మిల్ సూరి అరెస్టు

ధర్మవరంలో పర్యటిస్తున్న ఎస్పీ, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

తన వ్యాపార వ్యూహాలతో రైతులు, వ్యాపారస్తులకు అధిక లాభాల ఆశ చూపి, వారి నుండి సరుకులు సేకరించి డబ్బు చెల్లించకుండా మోసం చేసిన కొత్తచెరువు దాల్‌మిల్ సూరిని అరెస్టు చేసినట్లు శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. బుధవారం శ్రీ సత్య సాయి జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను ఆయన వెల్లడించారు. దాల్మిల్ సూరి గత కొన్ని సంవత్సరాల నుండి రైతులు వ్యాపారస్తుల నుండి అప్పు మీద ఆహార ధాన్యాలను కొనుగోలు చేస్తున్నాడని ఎస్పీ తెలిపారు. హోల్‌సేల్ వ్యాపారం పేరుతో అమాయక రైతులను, ప్రజలను చిన్నచిన్న వ్యాపారస్తులను మోసం చేసి వారి వద్ద నుండి భారీ మొత్తాలను దోచుకుని వారికి భారీ ఆర్థిక నష్టాన్ని కలగజేయడంతో ఇతనిపై 57 కేసులు నమోదైనట్లు వివరించారు. అంతేకాక అనేక శారీరక నేరాలు, మోసాలు, వైట్ కాలర్ నేరాలు, ఎస్సీ ఎస్టీలపై దౌర్జన్యాలకు పాల్పడినట్లు కేసులున్నాయని ఎస్పీ చెప్పారు. శ్రీ సత్య సాయి జిల్లాలో ఇతనిపై 26 కేసులు, రాష్ట్రంలోనే కాక కర్నాటక, తెలంగాణ, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల్లో కలిపి మొత్తం 57 కేసులు నమోదయినట్లు ఎస్పీ తెలిపారు. వీటిలో కొందరుతో రాజీ మార్గంలో వెళ్లి కేసులను ముగించారన్నారు. మరికొన్ని సివిల్ నేరాలుగా పరిగణించి కోర్టులో విచారణ దశలో ఉన్నాయని మిగిలిన కేసులు దర్యాప్తు దశలో ఉన్నాయని వివరించారు. కోర్టులో విచారణ దశ లో ఉన్న కేసులను సత్వరమే విచారణ పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టి నిందితునికి శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. దాల్మిల్ సూరిని ఆర్గనైజ్డ్ క్రిమినల్ గా గుర్తిస్తూ ఇతనిపై ఆర్గనైజ్డ్ క్రైమ్ కింద కేసులు నమోదు చేశామని, పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. దీనిని సవాల్ చేస్తూ నిందితుడు హైకోర్టులో పిటీషన్ వేయగా ఏపీ హైకోర్టు ఇతను నేర చరిత్రను పరిశీలించి పిటిషన్ డిస్మిస్ చేసిందని తెలిపారు. అంతేకాక ఇతని తమ్ముడు పాండు, కుటుంబ సభ్యులు రైతులు వ్యాపారస్తులు మోసగించారని, వారి ఆస్తులు, వారి బినామీల, కుటుంబ సభ్యుల మీద ఆస్తులను జప్తు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు. ఎవరైనా ఈ తరహాలో ప్రజలను, రైతులను వ్యాపారస్తులను మోసగించిన వారిపై కేసులు నమోదు చేసి పిడి యాక్ట్ క్రింద కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ పి హెచ్చరించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ధర్మవరం రూరల్ : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు ఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం ధర్మవరం పట్టణం ఇందిరమ్మ కాలనీలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలోని ప్రతి ఇంటిని, ఇంటి పరిసరాలను తనిఖీ చేశారు. ముఖ్యంగా రౌడీ షీటర్లు, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వ్యక్తుల ఇండ్లలో సోదాలు చేశారు.కాలనీలో ఉన్న రౌడీషీటర్ల ఇంటికి వెళ్లి వారి కుటుంబీకులతో మాట్లాడి మంచి ప్రవర్తనలో నడుచుకునే విధంగా బాధ్యత తీసుకోవాలని ఎస్పీ వారికి సూచించారు. రానున్న స్థానిక ఎన్నికలను దష్టిలో ఉంచుకొని ఎటువంటి సంఘటన తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలలో భాగంగా ఈ తనిఖీలని చేపట్టారు. అనంతరం జిల్లా ఎస్పీ కాలనీలో గ్రామసభ నిర్వహించి ప్రజలకు నేరాలపై అవగాహన కల్పించారు. గత 15 ఏళ్ల నుంచి ప్రశాంతమైన జీవితం గడుపుతున్న వారిపై ఉన్న రౌడీ షీట్లను తొలగించడం జరుగుతుందని చెప్పారు. ముఖ్యంగా రికార్డులు, నెంబర్ ప్లేట్లు లేని 85 ద్విచక్ర వాహనాలు, 4ఆటోలు సీజ్ చేశామన్నారు. ఇందిరమ్మ కాలనీలో ప్రస్తుతానికి 4 సీసీ కెమెరాలు ఉన్నాయని, మరో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో, ధర్మవరం పెనుగొండ డీఎస్పీలు హేమంత్ కుమార్, నర్సింగప్ప, సిఐలు రెడ్డప్ప, నాగేంద్రప్రసాద్, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- నాలుగు రాష్ట్రాల్లో మొత్తం 57 కేసులు
- ఎస్పీ సతీష్‌కుమార్

ప్రజాశక్తి
www.prajasakti.com

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి పల్లె

చిత్రావతి సుందరీకరణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలోని చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనుల ను బుధవారం మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పరిశీలించారు. పనులను నాణ్యతగా గడువులోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పల్లె మాట్లాడుతూ నవంబర్ 23వ తేదీ సత్యసాయి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో జోయ్‌లుక్కాస్ జ్యువెల్లరీ కంపెనీ ఆధ్వర్యంలో సిఎస్‌ఆర్ నిధులతో చిన్న పిల్లల పార్కు పనులతో పాటు చిత్రావతి రహదారి ప్రాంతంలో అభివృద్ధి పనులు జరుగుతున్నా యన్నారు. అనంతరం పట్టణంలో మృతి చెందిన పలువురి కుటుంబాలను పల్లె పరామర్శించారు. పెద్దబజార్ వెళ్లి రామ్మోహన్ కుటుంబాన్ని, పెద్దకమ్మవారిపల్లెలో కురుబ వీరజిన్నయ్య కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీతో పాటు తాను అండగా ఉంటానని ఆయా కుటుంబాలను భరోసా ఇచ్చారు. పల్లె వెంట నాయకులు సామకోటి ఆదినారాయణ, గంగాధర్‌నాయుడు, రత్నప్పచౌదరి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఎం.వెంకటరాముడు, సురేష్‌చౌదరి, కృష్ణప్రసాద్ ఉన్నారు.

బాల్యవివాహాలను నియంత్రిద్దాం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రానున్న 3, 4 రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అందరూ సమిష్టిగా పని చేయాలని ఎంపిడిఒ సాయి మనోహర్ సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం 'మన గ్రామాలు-మన బాధ్యతలు-మన విధులు' థీమ్‌తో అధికారులు ఎంపిపి గిరక లక్ష్మీదేవి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ బాల్యవివాహ రహిత మండలంగా మార్చేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. రైతుల సమస్యలు, పంట కోతలు, మద్దతు ధర, ఉపాధి హామీ అమలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ నెల చివరి వారం నుంచి నవంబర్ మొదటి వారం వరకూ నాశ ముక్త్ భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆయా అంశాలపై వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సలహాలు, సూచనలు, అభిప్రాయాలు తెలపవచ్చన్నారు. భవిష్యత్తులో పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు, డిడిఒ వెంకటేష్, ఏఓ అబ్దుల్‌నబి, సీనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మాతాంగి పీఠాధిపతిని సత్కరిస్తున్న ఆలయ అధికారులు

ఖాద్రీశుని సన్నిధిలో మాతాంగి పీఠాధిపతి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పట్టణంలో వెలసిన ఖాద్రీ శ్రీలక్ష్మీనరసింహస్వామిని బుధవారం మాతాంగి పీఠాధిపతి నందగిరి స్వామీజీ దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన స్వామీజీకి ముందుగా పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని, స్వామివారి ప్రసాదం, వస్త్ర, చిత్రపటాలను స్వీకరించారు. స్వామీజీ గిరి ప్రదక్షిణ కూడా చేశారు. ఆ సమయంలో భక్తులకు గిరి ప్రదక్షిణ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్.పార్థసారధి, గంగాధర్, పట్టణ అధ్యక్షుడు పీట్ల రామకృష్ణ, దస్విత్, రవిచంద్రన్‌నాయుడు, టెంకాయల కిష్టప్ప, గోవర్ధన్, పట్టణ ప్రముఖులు ఉన్నారు.

గర్భిణులకు సరైన వైద్యం అందాలి

ధర్మవరం రూరల్ : గర్భిణులకు, బాలింతలకు సకాలంలో సరైన వైద్యం అందించాలని జిల్లా వైద్యవిభాగ టాస్క్ ఫోర్స్ అధికారులు ఈరమ్మ, కళాధర్ వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. వారు బుధవారం మండలం లోని దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మల్లాకాలువ గ్రామంలో పర్యటించారు. వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర్ బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించడంతో పాటు వైద్య సేవలు మరింత విస్తృతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ డాక్టర్ చెన్నారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని కంబాలపల్లి పంచాయతీ పరిధిలోని శ్యాపురం గ్రామంలో కొంతకాలంగా తాగునీటి సమస్య నెలకొంది. గ్రామస్తుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి సవిత గ్రామంలో బోరు వేయించి నీటి సమస్యను పరిష్కరించాలని సర్పంచి కె.మంజును ఆదేశించారు. దీంతో సర్పంచి మంజు ఆ గ్రామంలోని పోతులప్పస్వామి ఆలయం వద్ద పంచాయతీ తరపున బోరు వేయించారు.

శక్తి టీమ్ ఆధ్వర్యంలో అవగాహన

లేపాక్షి : మండలంలోని నయనిపల్లి పంచాయతీలో బుధవారం శక్తి టీమ్ ఆధ్వర్యంలో మహిళలు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అత్యవసర సమయంలో 112కు ఫోన్ చేయాలన్నారు. అగ్ని ప్రమా దాలు సంభవిస్తే 101కి, ప్రమాదం సమయంలో 108కి ఫోన్ చేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహం జరిగితే 1098 ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటరాముడు, లింగమూర్తి పాల్గొన్నారు.

బిటి రోడ్ల నిర్మాణానికి రూ. 2 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-అమరాపురం

మండలంలోని రెండు గ్రామ పంచాయతీలకు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రత్యేక చొరవతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద బిటి రోడ్ల నిర్మాణానికి రూ. 2 కోట్ల నిధులు మంజూరైనట్లు సింగిల్‌విండో అధ్యక్షుడు ఎస్.గణేష్ తెలిపారు. హేమావతి, అమరాపురం మెయిన్ రోడ్డు నుంచి చిత్రలింగేశ్వర దేవాలయం వరకూ(మద్దనకుంట సమీపం), హేమావతి-హొసహట్టి మెయిన్ రోడ్డు నుంచి కోర్రేవు కర్నాటక బార్డర్ వరకూ వయా(రంగనాథ స్వామి దేవాలయం) రోడ్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

రోడ్డుపైనే వర్షం నీరు

ప్రజాశక్తి-తాడిమర్రి

మండలంలోని తురకవారిపల్లి గ్రామంలో రోడ్లు నీటి కాలువలను తలపిస్తున్నాయి. గ్రామంలో ఇరువర్గాల మధ్య విభేదాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని కొందరు నాయకులు వర్షం నీరు వెళ్లే దారికి అడ్డుగా మట్టి వేశారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేక రోడ్డుపై నిలిచి కాలువను తలపిస్తున్నాయి. రోడ్డుపై మోకాలి లోతు నీరు నిలవడంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వీధిలో కొన్నేళ్లుగా ఈ సమస్య ఉందని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ముస్లిం రిజర్వేషన్ల పాదయాత్రకు సంఘీభావం

హిందూపురం : ముస్లిం రిజర్వేషన్ల సాధన కోసం చేపట్టిన పాదయాత్రకు ముస్లిం నగరా చైర్మన్, టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ సంఘీభావం తెలిపారు. ముస్లిం రిజర్వేషన్ల సాధన కోసం సింహాద్రిపురం నుండి పులివెందుల వరకు ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో ముస్లిం రిజర్వేషన్ల సాధన కోసం పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రలో ఉమర్ ఫారూఖ్ ఖాన్ పాల్గొని సంఘీభావం తెలియజేస్తూ మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ముస్లిం సామాజిక వర్గాన్ని ప్రతి రాజకీయ పార్టీ ఓట్ల సమయంలో మాత్రమే ఓటు బ్యాంకుగా వాడుకుంటోందని పేర్కొన్నారు. ముస్లింలకు రావాల్సిన రాజకీయ, సామాజిక, ఉద్యోగ హక్కులను విస్మరిస్తోందని, ఇకపై అలాంటి విధానాలు చెల్లవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖలీల్ సయ్యద్. కదిరి మహిళా నాయకురాలు పర్వీన్ బాను, జాఫర్ పులి, వసీం బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో

ప్రజాశక్తి-చిలమత్తూరు

వాయుగుండం ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డిఒ ఆనంద్ కుమార్ సూచించారు. భారీ వర్షాల కారణంగా మండలంలో ప్రవహించే చిత్రావతి నదిలో నీటి ప్రవాహం పెరుగుతుండటంతో బుధవారం ఆయన కొడికొండ సమీపంలో చిత్రావతి నదిలో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండటంతో నదులు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉందని, నదీ పరివాహక ప్రాంతాల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నది పరిసరాల్లోకి ఎవ్వరూ వెళ్లకూడదని హెచ్చరించారు. ఆర్‌డిఒ వెంట డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చిత్రావతి నది పరిసర ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఆర్డీవో, యోగి వేమన డ్యాంను సందర్శించిన తహశీల్దార్

యోగి వేమన డ్యాం పరిశీలన

ముదిగుబ్బ : మండలంలో ఉన్న యోగి వేమన డ్యాంను బుధవారం తహశీల్దార్ పరిశీలించారు. అక్కడ వున్న వర్క్ ఇన్‌స్పెక్టర్ సిద్ధారెడ్డిని డ్యాంకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. 4 రోజులు వర్షాలు కురిసినా ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. డ్యాంలో ఇంకా 3 అడుగుల నీటి మట్టం తక్కువగా ఉందని పైనుంచి నీరు రావడం లేదని, దీంతో ఎలాంటి ఇబ్బంది లేదని వర్క్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అనంతరం తహశీల్దార్ మండలంలోని కొడవండ్లపల్లి వద్ద మద్దిలేరు వాగును పరిశీలించారు. అక్కడ ఉన్న బ్రిడ్జిని పునర్ నిర్మించగా వాటిపై వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయని, ప్రజలకు ఎలాంటి సమస్య లేదన్నారు.

గుడిబండ : భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ శ్రీధర్ సూచించారు. రానున్న రెండు, మూడు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. పిడుగులు పడే ప్రమాదం కూడా ఉందని, బయటికి వెళ్లినవారు సాయంత్రం 5 గంటల లోపు ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. పాత ఇళ్లలో పడుకోవద్దన్నారు. పశువులు, మేకలు, గొర్రెలను మేతకు తీసుకెళ్లిన వారు విద్యుత్ స్తంభాలు, వ్యవసాయ బోరు బావులకు దూరంగా ఉండాలన్నారు. చిన్నపిల్లలను ఒంటరిగా బయటకు పంపించవద్దన్నారు. ఈదురు గాలులు వీచే సమయంలో విద్యుత్ స్తంభాలు, చెట్ల కింద ఉండవద్దని సూచించారు. అనంతరం మండలంలోని మోరుబాగల్ చెరువును పరిశీలించి రెవెన్యూ సిబ్బంది, రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

పరిగి : రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ హసీనా సుల్తానా ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె పరిగి ట్యాంక్ బండ్, సంగమేశ్వరం బ్రిడ్జ్ ప్రదేశాలను పరిశీలించారు. ఈ రెండు రోజులు పిడుగులు పడే అవకాశం ఉందని, ప్రజలు సాయంత్రం త్వరగా ఇంటికి చేరుకోవాలన్నారు. పాత గుడిసెలు, మిద్దెల్లో ఉన్నవారు ప్రభుత్వ భవనాల్లో నివాసం ఉండాలని సూచించారు. అత్యవసర సాయం కోసం 94419 50971, 63011 41397, 90326 42986కు ఫోన్ చేయాలన్నారు.

పరిగి ట్యాంక్ బండ్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్

ధర్మవరం రూరల్ : ఆర్డీవో మహేష్ బుధవారం ధర్మవరం, రేగాటిపల్లి, గొట్లూరు చెరువులతో పాటు పోతులనాగేపల్లి వద్ద గల చిత్రావతి నదిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలో మూడు రోజులుగా వర్షాలు అధికంగా కురుస్తుండడంతో ప్రజలు అనవసరంగా బయట తిరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటికే 80 శాతం చెరువులు నిండాయని, మరో రెండు రోజులు వర్షాలు అధికంగా ఉన్నందున అధికారులు ప్రతి చెరువు వద్ద ప్రత్యేక నిఘా ఉంచి, ప్రజలకు భద్రత కల్పించాలన్నారు. ఎక్కడైనా ఏదైనా జరిగితే ప్రజలు సాయం కోసం వెంటనే తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్-95539 29724, ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్-98660 57959కు ఫోన్ చేయాలన్నారు. ఆయన వెంట తహశీల్దార్ సురేష్‌బాబు, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

లేపాక్షి : రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, మండల ప్రజలు అప్రమత్తం గా ఉండాలని తహశీల్దార్ సౌజన్యలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయంపై గ్రామాల్లో టాం టం వేయించామన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పట్టణంలో గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:30 గంటలకు మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి అధ్యక్షతన జరిగే అత్యవసర కౌన్సిల్ సమావేశంలో పలు అభివృద్ధి పనులపై చర్చిస్తామన్నారు. ముఖ్యంగా సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు కావాల్సిన నిధులు, చేపట్టాల్సిన పనులపై చర్చ ఉంటుందన్నారు. కావున కౌన్సిలర్లు, అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు : ఆర్డీవో

ప్రజాశక్తి-తనకల్లు

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో వివి.శర్మ హెచ్చరించారు. తనకల్లు గ్రామ పొలం సర్వే నంబర్-793లోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకున్నారు. దీంతో బుధవారం ఆ భూమిలో ఆర్డీవో ఆధ్వర్యంలో అధికారులు, విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపిడిఒ, ఎస్ఐ గోపి, డిప్యూటీ తహశీల్దార్ మల్లికార్జున, ఆర్ఐ అశోక్, ఎంఇఒ, మండల సర్వేయర్ పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో ఇటీవల కురిసిన వర్షాలకు నీటితో కళకళలాడుతున్న మండలంలోని చెన్నరాయస్వామి గుడి ప్రాజెక్టును సందర్శించారు. అలాగే గేట్లు ఎత్తి నీటిని కిందికు వదిలారు. ఆర్డీవో మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు బాగా కురవడంతో అక్కడక్కడ చెరువులు నిండాయని, రైతులు పంటలు సాగు చేయడానికి బోర్లలో భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటాయన్నారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, మండల పరిధిలోని వండమానేరు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఫెన్సింగ్‌లో జస్వంత్‌రెడ్డికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-తలుపుల

ఈ నెల 18, 19 తేదీల్లో కాకినాడలోని లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన ఎపి రాష్ట్ర స్థాయి అండర్-14 ఫెన్సింగ్ పోటీలు-2025లో మండలంలోని తోగటవండ్లపల్లి గ్రామానికి చెందిన బండ్లపల్లి జస్వంత్‌రెడ్డి ప్రతిభ చాటి గోల్డ్‌మెడల్ సాధించారు. జస్వంత్‌రెడ్డి ఇప్పి టీం క్యాటగిరిలో అద్భుత ప్రదర్శన చేశారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని వెంకీ స్పోర్ట్స్ అకాడమీ అనంతపురం కోచ్ రాహుల్ ఆకాంక్షించారు.

ఆవుకు శస్త్రచికిత్స..

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో 4 రోజుల క్రితం రాత్రి 8 గంటల సమయంలో ఎపిఎస్ ఆర్టీసీ బస్సు దూసుకెళ్లడంతో రెండు ఆవులు తీవ్రంగా గాయపడ్డాయి. అందులో ఒకటి రెండు రోజుల చికిత్స అనంతరం కోలుకోగా మరొక ఆవు కాలు విరగడంతో స్థానిక పశు వైద్యశాల డాక్టర్ హేమలత ఆధ్వర్యంలో హిందూపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆ ఆవుకు జిల్లా జెడి శుభదాస్, డిడి పెంచలయ్య, ఎడి తిప్పేస్వామి ఆధ్వర్యంలో పశు వైద్యులు డాక్టర్ సుబ్బరాయుడు, డాక్టర్ కిషోర్, డాక్టర్ హేమలత, డాక్టర్ బాలఈశ్వరరాజు సుమారు 3 గంటలు శ్రమించి శస్త్రచికిత్స చేసి విరిగిన కాలును తొలగించారు. ఇదిలా ఉండగా స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో నిత్యం రద్దీ ఉంటుందని, డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలు నడపాలని స్థానికులు కోరుతున్నారు.

'ఉపాధి' కూలీలకు ఈకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-నల్లమాడ

ఉపాధి హామీ జాబ్ కార్డ్ ఉన్న ప్రతి కూలీకి తప్పనిసరిగా ఈకెవైసి చేయించాలని ఎంపిడిఒ జి.శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా విరివిగా ఉపాధి పనులు కల్పించాలని, జాబ్ కార్డ్ ఉన్న ప్రతి కూలీకి ఈకెవైసి చేయించాలన్నారు. మండలాన్ని ప్రగతిపథంలో నడపాలని టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. సమావేశంలో ఎపిఒ రఘునాథ్‌రెడ్డి, జెఈ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కార్మికులపై డిపో మేనేజర్ వేధింపులు ఆపాలి

హిందూపురం : హిందూపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ కార్మికుల పట్ల వేధింపు చర్యలకు పాల్పడడం తగదని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు విమర్శించారు. కేవలం ఒకే యూనియన్‌కు వత్తాసు పలుకుతూ మిగిలిన యూనియన్లను నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదన్నారు. డిపో మేనేజర్ వైఖరిని నిరసిస్తూ బుధవారం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో డిపో ఎదుట కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ నాయకులు నారాయణస్వామి, డిపో కార్యదర్శి మల్లికార్జున, గ్యారేజ్ కార్యదర్శి ఇర్షాదుల్లా మాట్లాడుతూఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో డిపో మేనేజర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. డ్రైవర్, కండక్టర్లకు కొత్త డ్యూటీ చార్టు వెంటనే వేయాలని, డ్యూటీ చార్టు వద్ద జరుగుతున్న అవకతవకలను సరిచేయాలని, ఒకే యూనియన్ కు అనుకూలంగా వ్యవహరిస్తున్న కంట్రోలర్ రంగా నాయక్ ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రతాప్ రెడ్డి, రూపేంద్ర కుమార్, మోహన్, ప్రభావతి, నాగరత్న, వెంకటేష్, అశ్వర్థ నారాయణ, శ్రీనివాసులు, నాగరాజు, విఘ్నేశ్వర తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

కేతిరెడ్డి హయాంలోనే అభివృద్ధి : వైసిపి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హయాంలోనే నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందని వైసిపి నాయకులు మాసపల్లి సాయికుమార్, దేవరకొండ రమేష్ తెలిపారు. వారు బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి పాలనలో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఎంతో అభివృద్ధి చేశారన్నారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను ప్రజల వద్ద చేర్చారన్నారు. మున్సిపల్ ఛైర్మన్‌తో పాటు కురుబ, తొగటవీర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ వంటి రాష్ట్ర స్థాయి పదవులను బిసిలకు కేటాయించారన్నారు. మార్కెట్ యార్డ్, మున్సిపల్ కాంప్లెక్స్‌కు శాశ్వత భవనాలు, రోడ్ల వెడల్పు, పార్నపల్లి రిజర్వాయర్ నుంచి తాగునీరు, స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి పోతుకుంట వరకు బ్రిడ్జి వంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్‌యాదవ్ ధర్మవరంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. కదిరి గేట్ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి అర్ధాంతరంగా ఎందుకు ఆగిపోయిందో బిజెపి నాయకులు ప్రజలకి సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఇకనైనా కేతిరెడ్డిపై అసత్య, అనవసర విమర్శలు మాని, అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు చెలిమి రామయ్య, చౌడప్ప, సాయి, పెద్దన్న పాల్గొన్నారు.

గాండ్లపెంట ఎస్‌ఐగా కె.క్రాంతి

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండల నూతన ఎస్‌ఐగా కె.క్రాంతి బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ రవికుమార్ విఆర్‌కు బదిలీ కావడంతో ఆ పోస్టు ఖాళీగా ఉండేది. ఇటీవల ఈ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ త్వరలోనే నూతన ఎస్ఐ నియమిస్తామని తెలిపారు. ఆ మేరకు శిక్షణ పూర్తిచేసుకుని కొత్తచెరువులో విధులు నిర్వహిస్తున్న కె.క్రాంతిని ఇక్కడికి బదిలీ చేశారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవలే ఎస్ఐ శిక్షణ పూర్తి చేసుకొని కొత్తచెరువులో 2 నెలలు పని చేశానన్నారు. మండలంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తామని, అసాంఘిక కార్యకలాపాలను అరికడతామన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఎస్ఐకు ఎఎస్ఐ వెంకటరాముడు, జమేదార్ తిరుమలరెడ్డి, శ్రీనివాసులు, భాస్కర్ రాజు, గురు ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

తూతూ మంత్రంగా మండల మీట్..!

అగళి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి పలువురు అధికారులు, సభ్యులు గైర్హాజరయ్యారు. దీంతో సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించకుండానే తూతూ మంత్రంగా సమావేశం నిర్వహించి గంట లోపే ముగించారు. అధికారులు గత 3 నెలల్లో చేపట్టిన పనుల వివరాలను చదివి వినిపించారు. సమస్యలను ప్రస్తావించే వారే కరువయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపిపి రేణుక కామరాజు, జడ్పిటిసి ఉమేశ్ గైర్హాజరైన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సమావేశాలు నిర్వహించడం వల్ల ఒరిగేదేమీ లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమావేశంలో ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, తహశీల్దార్ సుబ్బారావు, ఎంపిటిసిలు, ముగ్గురు సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

బిసి కాలనీకి మట్టి రోడ్డు ఏర్పాటు

ప్రజాశక్తి-రొద్దం

రొద్దం గ్రామంలోని బిసి కాలనీకి వెళ్లే రోడ్డు కొన్నేళ్లుగా గుంతలమయమై ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి. ఈ విషయాన్ని టిడిపి మండల నాయకులు రాష్ట్ర మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆమె సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో నాయకులు బుధవారం ఎర్రమట్టి తోలి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. రోడ్డు పనులను ఎంపిడిఒ రామ్‌కుమార్, నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, సింగిల్ విండో అధ్యక్షులు వీరాంజనేయులు, అశ్వర్థనాయణ, చంద్రమౌళి, నరసింహులు, కంబాలపల్లి సర్పంచి మంజు, డీలర్ల సంఘం అధ్యక్షులు సిద్దన్న, చెన్నకేశవులు, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహమూర్తి, అక్బర్ పరిశీలించారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

'ఆధార్' ఇక్కట్లు..!

ప్రజాశక్తి-నంబులపూలకుంట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ప్రతి సంక్షేమ పథకానికి ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియలో తలెత్తే సమస్యలను పరిష్కరించడంలో మండల అధికా రులు విఫలం అయ్యారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. గతంలో గ్రామ సచివాల యాల్లో ఆధార్ కేంద్రం నిర్వహించేవారు. ఏడాదిగా సంబంధిత అధికారులు ఆధార్ కేంద్రాలను మూసివేసినట్లు తెలుస్తోంది. దీంతో ఆధార్ కార్డులో ఎలాంటి చిన్న పొరపాటు ఉన్నా దానిని సరి చేసుకోవడానికి మండల ప్రజలు అన్నమయ్య జిల్లాలోని గాలివీడు, రాయచోటికి వెళ్లాల్సి వస్తోంది. అక్కడ కూడా ఆధార్ కేంద్రాలు రద్దీగా ఉండడంతో కదిరికి వెళ్తున్నారు. అక్కడ సైతం ఆధార్ కేంద్రాల వద్ద రద్దీ అధికంగా ఉండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల 15 ఏళ్ల లోపు విద్యార్థులకు ఆధార్ కార్డులో తప్పు, ఒప్పులను సరిదిద్దడానికి ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. అయితే ఎన్‌పి కుంటలో కెజిబివితో పాటు ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మొత్తం 2,814 మంది విద్యా ర్థులు ఉన్నారని, వారి అవసరాలకు అనుగుణంగా స్థానికంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఓపెన్ చెస్ టోర్నీ కరపత్రాలు విడుదల చేస్తున్న నిర్వాహకులు

8 నుంచి ఓపెన్ చెస్ టోర్నీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని కొత్తపేటలో ఉన్న శ్రీఉషోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో నవంబర్ 8, 9 తేదీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల ఓపెన్ చెస్(చదరంగం) పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజర్ డైరెక్టర్ ఈశ్వరప్ప, హానరబుల్ అధ్యక్షులు డాక్టర్ బివి.సుబ్బారావు, ఆర్గనైజింగ్ అధ్యక్షులు చాంద్‌బాషా, ఆర్గనైజింగ్ కార్యదర్శి జాకీర్ హుస్సేన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో ఓపెన్ చెస్ పోటీల కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ పోటీలను యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ప్రవేశ రుసుము రూ 600 చెల్లించాలని, విజేతలకు రూ. 60 వేల నగదు బహుమతి ఇస్తామన్నారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, వ్యవస్థాపక అధ్యక్షులు పోలా ప్రభాకర్, కౌన్సిలర్ కేతా లోకేష్, సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మహేష్

ఓటరు జాబితాపై సమీక్ష

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఓటరు జాబితాపై బుధవారం పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని రాజకీయాల పార్టీల ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, ఇతర సమస్యలపై ఆర్‌డిఒ మహేష్ వారితో చర్చించారు. సమావేశంలో నియోజకవర్గ ఎఈఆర్‌ఒలు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్లు, ఎన్నికల సీనియర్ సహాయకులు రాఘవరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా లక్ష్మీనారాయణయాదవ్

ప్రజాశక్తి-చిలమత్తూరు

అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మండలానికి చెందిన జి.లక్ష్మీనారాయణ యాదవ్‌ను నియమించినట్లు బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా. వెంగలరావు ప్రకటించారు. వెంగలరావు మాట్లాడుతూ లక్ష్మీనారాయణయాదవ్ 15 ఏళ్లుగా యాదవ సంఘానికి అనేక విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. అలాగే యాదవుల హక్కుల సాధన కోసం విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో యాదవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, సంఘాన్ని బలోపేతం చేయడానికి పలు కార్యక్రమాలు నిర్వహించారన్నారు. సంఘం నిర్మాణాన్ని మరింత పటిష్టపరచి, విస్తృతం చేయడంలో లక్ష్మీనారాయణ యాదవ్ కీలక పాత్ర పోషించారన్నారు. యాదవ సామాజిక వర్గం ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించి అఖిల భారత యాదవ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సభ్యులకు లక్ష్మీనారాయణ యాదవ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో జూనియర్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక జడ్పీ హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న లక్ష్మీనారాయణనాయక్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈయన గుడిబండ ఎంపిడిఒ కార్యాలయంలో సుదీర్ఘకాలం పని చేశారు. బదిలీపై అమరాపురం మండలానికి వెళ్లిన ఈయన ఇటీవల స్థానిక జడ్పీ హైస్కూల్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీపై వచ్చారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మీనారాయణనాయక్ బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంపిడిఒ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది, జడ్పీ హైస్కూల్ లక్ష్మీనారాయణనాయక్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ లక్ష్మీనారాయణనాయక్ మృతి బాధాకరమని విచారం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని ఆర్.కొట్టాల గ్రామంలో బుధవారం పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. మండలంలోని చిన్నమంతూరు గ్రామానికి చెందిన వడ్డీ నాగభూషణ ద్విచక్ర వాహనంపై పావగడ వైపు నుంచి వస్తూ ఆర్.కొట్టాల గ్రామంలోని బస్టాప్ వద్ద వెళ్తుండగా కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఆటో సాయంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హిందూపురం ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

టీ కేఫ్‌లో చోరీ

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని కోనేరు వద్ద ఉన్న డెక్కన్ టీ కేఫ్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు వెనుక వైపు నుంచి కేఫ్ లోపలికి ప్రవేశించి, కౌంటర్‌లో ఉన్న రూ. 12వేల నగదు, రూ. 10వేల విలువ చేసే సిగరెట్ ప్యాకెట్లు ఎత్తుకెళ్లారు. బాధితుడు మూడే నరేష్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు.

IN THE COURT OF THE PRL.SENIOR CIVIL JUDGE, ANANTAPURAMU
E.P.NO.93/2024 in O.S.NO.134/2006

Between:
M.Ramadevi ...**Petitioner/D.Hr**
And
A.Rajeswari ...**Respondant/ J.Dr**

NOTICE TO THE J.DR

TO,
A.Rajeswari W/o Sadasivudu, Sinecure, R/o D.No.6/470-B4, Ram Nagar, Ananthapuramu.

పై నెంబరు కేసులో J.Dr అయిన మీ హాజరు నిమిత్తము 5-11-2025వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

D.Shyam Sunder,K.Mohan Rao,
Advocates, Anantapuramu,
Cell No:9440258700